

అదుపుతప్పి.. వాహనాలపైకి దూసుకెళ్లి..
కడప–రాయచోటి ప్రధాన రహదారిలోని గువ్వల చెరువు ఘాట్ రోడ్డులో పాలవ్యాన్ అదుపు తప్పి బోల్తా పడింది. - 8లో



కేంద్ర సాఫ్ట్‌వేర్‌తో ‘ఉపాధి’ అలవెన్స్‌లకు బ్రేక్
ఉపాధి హామీ పథకంలో రాష్ట్ర సాఫ్ట్‌వేర్ స్థానంలో కేంద్ర సాఫ్ట్‌వేర్‌ను తీసుకురావడంతో పలు అలవెన్స్‌లకు బ్రేక్ పడింది. - 8లో



ఇసుక తరలింపు అడ్డగింత
ఎర్రగుంట్ల మండల పరిధిలోని ఇల్లూరు గ్రామ సమీపంలో ఉన్న పెన్నానది నుంచి ఇసుకను తరలింపును గ్రామస్తులు అడ్డుకున్నారు. - 8లో

న్యూస్‌రీల్

14న జెడ్పీ స్టాండింగ్ కమిటీల సమావేశం

కడప సెవెన్‌రోడ్స్: జిల్లా పరిషత్ స్టాండింగ్ కమిటీల సమావేశం ఈనెల 14వ తేదీ ఉదయం 9.00 గంటలకు కడప జెడ్పీ కార్యాలయంలో జరుగుతుందని ముఖ్య కార్యనిర్వహణాధికారి ఎం.సుధాకర్‌రెడ్డి తెలిపారు. ప్రతి రెండు నెలలకు ఒకసారి ఈ స్టాండింగ్ కమిటీ సమావేశాలు జరుగుతాయన్నారు. జిల్లా పరిషత్ సభ్యులు, అధికారులు స్టాండింగ్ కమిటీ సమావేశానికి నిర్దేశించిన సమయం కంటే ఒక గంట ముందు రావాలని కోరారు. అధికారులు తమ శాఖాపరమైన ప్రగతి నివేదికలు, సంబంధిత సమాచారంతో హాజరు కావాలన్నారు.

వేమన విగ్రహ నిర్మాణ పనుల పరిశీలన



వేమన విగ్రహ ఏర్పాటు పనులను పరిశీలిస్తున్న వీసీ, రిజిస్ట్రార్, ప్రిన్సిపాల్

వైవీయూ: యోగివేమన విశ్వవిద్యాలయం ప్రధాన ద్వారం వద్ద ఉన్న వేమన విగ్రహ నిర్మాణ పనులను వైవీయూ వైస్ చాన్సలర్ ఆచార్య చింతా సుధాకర్ పరిశీలించారు. విగ్రహం ఎత్తు పెంచడంతో పాటు, ఆకర్షణీయంగా రూపొందించాలని, సౌకర్యవంతంగా మెట్లు ఉండాలని ఇంజినీరింగ్ అధికారులను ఆదేశించారు. రిజిస్ట్రార్ ఆచార్య వై.పి.వెంకటసుబ్బయ్య మాట్లాడుతూ విగ్రహం ఏర్పాటులో తీసుకోవాల్సిన జాగ్రత్తలను సూచించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ ఆచార్య ఎస్. రఘునాథరెడ్డి, ఇంజినీర్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

20 న చలో విజయవాడ

కడప వైఎస్‌ఆర్ సర్కిల్: ఈ నెల 20న తలపెట్టిన చలో విజయవాడను జయప్రదం చేయాలని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎల్. నాగసుబ్బారెడ్డి కోరారు. శుక్రవారం నగరంలోని హోచిమన్ భవన్‌లో చలో విజయవాడకు సంబంధించిన కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలోని భవన నిర్మాణ కార్మికులందరికి భవన నిర్మాణ సంక్షేమ బోర్డును పునరుద్ధరించాలని కోరారు. ఏపీ బిల్డింగ్ అండ్ కన్‌స్ట్రక్షన్ వర్కర్స్ యూనియన్ జిల్లా నాయకులు మద్దిలేటి, లింగన్న, బి. రామాంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

నేడు రౌండ్ టేబుల్ సమావేశం

కడప కోటిరెడ్డిసర్కిల్ : ఎస్సీ, ఎస్టీ, బీసీ,మైనార్టీ మహిళా ఐక్య వేదిక ఆధ్వర్యంలో శనివారం ఉదయం 10 గంటలకు ‘ప్రమాదంలో రాజ్యాంగం – రాజ్యాంగాన్ని కాపాడుకోవడంలో మహిళల బాధ్యత’ అనే అంశంపై రౌండ్ టేబుల్ సమావేశాన్ని నిర్వహిస్తున్నట్లు ఐక్యవేదిక ప్రతినిధులు రాజేశ్వరి, నంది విజయలక్ష్మిలు తెలిపారు. ఈ మేరకు వారు శుక్రవారం మీడియాతో మాట్లాడారు. ఈ సమావేశానికి పూలే, అంబేద్కర్ ఆలోచనా విధానాన్ని అనుసరించే ప్రతి ఒక్కరూ హాజరై తమ అభిప్రాయాలను తెలియజేయవచ్చన్నారు.

భూమిని అంతర్ పంటలతో కప్పి ఉంచుకోవాలి



సమావేశంలో మాట్లాడుతున్న రిటైర్డు చీఫ్ సెక్రటరీ విజయ్‌కుమార్

కడప అగ్రికల్చర్: రైతులందరూ తమ భూమిని 365 రోజులు వివిధ అంతర్ పంటలతో కప్పి ఉంచుకోవాలని రైతు సాధికార సంస్థ ఎగ్జిక్యూటివ్ వైస్ చైర్మన్ అండ్ ఎక్స్‌అఫిషియో, రిటైర్డు చీఫ్ సెక్రటరీ విజయ్‌కుమార్ అన్నారు. ఇలా కప్పి ఉంచడం వల్ల భూతాపం తగ్గి సూక్ష్మ పోషకాలు అభివృద్ధి చెందుతాయన్నారు. శుక్రవారం కడప కలెక్టర్ కార్యాలయ వీడియో కాన్ఫరెన్స్ హాలులో ప్రకృతి వ్యవసాయ సిబ్బందికి నెలవారి కార్యాచరణపై సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ జిల్లాలో ప్రకృతి వ్యవసాయ విస్తీర్ణతను పెంచాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ అధికారి నాగేశ్వరరావు, ప్రకృతి సేద్యం జిల్లా ప్రాజెక్టు మేనేజర్ రామకృష్ణ పాల్గొన్నారు.

పూర్తిస్థాయిలో ఉర్దూమీడియం పుస్తకాలను అందించాలి

కడప ఎడ్యుకేషన్: జిల్లాలోని ఉర్దూ మీడియం విద్యార్థులందరికి సకాలంలో పాఠ్యపుస్తకాలను అందించాలని రాష్ట్ర ఉర్దూ టీచర్స్ అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సయ్యద్ ఇక్బాల్, జిల్లా అధ్యక్షులు మహమ్మద్ ఇర్షాద్, జిల్లా ప్రధాన కార్యదర్శి జాకీర్‌హుస్సేన్‌లు కోరారు. ఈ విషయమై శుక్రవారం డీఈఓ రాఘవరెడ్డిని తమ కార్యాలయంలో కలిసి వినిపత్రాన్ని సమర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఉర్దూ విద్యార్థులందరికి పుస్తకాలను అందించే విధంగా చర్యలు తీసుకోవాలని కోరారు.

గణగణ గంట.. సిద్ధమవ్వాలంట!

ఇంట్లో బడి వాతావరణం అలవాటు చేస్తున్నాం



నాపేరు సురేష్. మాది కడప. మాకు ఇద్దరు పిల్లలు. కూతురు 2వ తరగతిలోకి, బాబు 3వ తరగతిలోకి వెళ్లనున్నారు. సెలవుల తర్వాత పిల్లలకు బడి భయం సహజంగా ఉంటుంది. మా పిల్లల్లో ఇది లేకుండా సిద్ధం చేస్తున్నా. ఉదయాన్నే నిద్రలేచి వారిని బయట పార్కులకు తీసుకెళుతున్నా. ఇంట్లో హోం స్కూలింగ్ తరగతులు నిర్వహిస్తున్నాం. ఉదయం నిద్రలేవాలని బలవంత పెట్టేకన్నా, ఉదయం వేళ ప్రకృతి ఆహ్లాదకరంగా ఉంటుందని, సూర్యోదయం సమయంలో బయటకు వెళితే కొత్త ఉత్సాహం వస్తుందని చెబితే పిల్లలు నాతో పాటు వాకింగ్‌కు వస్తున్నారు. బద్ధకం పోగొట్టి ఏదో ఒక వ్యాపకంలో పెడితే వారు పాఠశాలకు అంతే ఉత్సాహంగా వెళతారు.



నాపేరు కిరణ్‌కుమార్, నాది కడప భవానీ నగర్. నేను ఫార్మా కంపెనీ మేనేజర్‌గా పనిచేస్తున్నాను. నాకు 10వ తరగతి చదివే గంగా వేదాంగసాయి అనే కుమారుడు, 7వ తరగతి చదివే హసనీశ్రీ అనే కుమార్తె ఉన్నారు. వీరిని కడప నగర శివార్లలోని ఓ ప్రైవేటు పాఠశాలలో చదివిస్తున్నాను. వీరికి ప్రస్తుతం పుస్తకాల కోసం రూ.10,500, యూనిఫాం కోసం రూ.9800, మొదటి విడత ఫీజుకు సంబంధించి రూ.60 వేలు చెల్లించాను. ముందుముందు పలు రకాల ఖర్చులుంటాయి. వీరి కోసం ప్రత్యేక ఆర్థిక ప్రణాళికను సిద్ధం చేసుకోవాల్సి వస్తుంది.



కడప: చెమ్ముమియ్యాపేట జెడ్పీ గర్ల్స్ హైస్కూల్

- ఈనెల 12 నుంచి తెరుచుకోనున్న పాఠశాలలు
- సెలవుల వాతావరణం నుంచి ఇంకా బయటపడని పిల్లలు
- ముందస్తు సంసిద్ధత అవసరం అంటున్న నిపుణులు

కడప ఎడ్యుకేషన్: మరో మూడు రోజుల్లో పాఠశాలలు పునః ప్రారంభం కానున్నాయి. సెలవుల్లో ఆటపాటల్లో మునిగి తేలిన పిల్లలు బడి గంట మోగగానే వెళ్లడానికి కాస్త బెరుకుగానే ఉంటారు. దీన్ని ‘స్కూల్ ఫోబియా’ అంటారు. దీన్నుంచి వారిని బయట పడేయాలంటే తల్లిదండ్రులు ఇప్పటినుంచే మానసికంగా సిద్ధం చేయాలి. పిల్లలు సంతోషంగా బడికి వెళ్లాలంటే ముందస్తు సంసిద్ధత అవసరం అంటున్నారు నిపుణులు.

ఆర్థిక ప్రణాళిక అవసరం

సెలవులు ముగుస్తున్నాయంటే పిల్లలను సిద్ధం చేయడమే కాదు. ప్రైవేటు పాఠశాలల్లో తమ పిల్లల్ని చదివించే తల్లిదండ్రులు ఆర్థికంగా సిద్ధం కావాలి. ఫీజులు చెల్లించడం, పుస్తకాలు, యూనిఫాం, బూట్లు కొనుగోలుకు రూ. వేలల్లో వెచ్చించాలి. ఇందుకు తగిన విధమైన ఆర్థిక ప్రణాళిక అవసరం. నెల జీతంలో పిల్లల కోసం కొంత పక్కన పెట్టాలి.

సెలవుల్లో..

- తల్లిదండ్రులు కాస్త గారాబం ఎక్కువ చేస్తారు. పిల్లలు పొద్దెక్కే వరకు పడుకున్నా ఏమీ అనరు.
- పుస్తకాలు చదవడానికి బదులు సెల్‌ఫోన్లపై ఎక్కువ సమయం గడిపి ఉంటారు.
- ఆహార సమతుల్యత దెబ్బతిని ఉంటుంది. పిండి వంటలు, మిఠాయిలు, బయటి చిరుతిళ్లు ఎక్కువగా తింటుంటారు. ఇంట్లోనూ రకరకాల వంటలు వండిపెడుతుంటారు.
- జీవన శైలిలో సైతం పిల్లల్లో అనేక మార్పులు కనిపిస్తాయి. విహార యాత్రలకు వెళ్లడం, అమ్మమ్మ, బంధువుల ఇంటికి వెళ్లడం లాంటివి సెలవుల్లో పరిపాటి.

ఇకపై ఇలా..

- బడికెళ్లేటప్పుడు ఉదయం ఎన్ని గంటలకు నిద్రలేచేవారో ఇప్పుడూ అదే సమయానికి మేల్కొనేలా చూడాలి.
- సెల్‌ఫోన్లు చూడటం తగ్గించాలి. ఇప్పటివరకు రోజుకు రెండు మూడు గంటలు చూస్తే.. వచ్చే వారం పదిరోజులు రోజుకు అరగంట మించకుండా పెద్దలు జాగ్రత్త పడాలి. కథల పుస్తకాలు, జీవిత చరిత్ర, వ్యక్తిత్వ వికాస, తరగతి పుస్తకాలు రోజుకు కనీసం అయిదారు పేజీలైనా చదివేలా చూడాలి.
- బడికెళ్లేటప్పుడు ఉదయం అల్పాహారం, మధ్యలో స్నాక్స్, మధ్యాహ్న భోజనం, సాయంత్రం వేళకు భోజనం క్రమశిక్షణగా చేసినట్టే ఇప్పుడూ అలవాటు చేయాలి. చిరుతిళ్లను మాన్పించాలి. పాఠశాలల్లో భోజన సమయాలను తెలుసుకుని ఇప్పటి నుంచే ఆ విధంగా అందించాలి.
- సెలవులకు వెళ్లిన వారిని వీలైనంత ముందుగా ఇంటికి తీసుకురావడం శ్రేయస్కరం. లేదంటే మర్నాడు స్కూలు ఉందనగా ఈ రోజు తీసుకొస్తే ఫోబియాతో పిల్లలు మొదట ఒకటి రెండు రోజులు బడి మానేసే ప్రమాదం లేకపోలేదు.

బడిబాటలో ఉపాధ్యాయులు

ఇప్పటికే పలువురు ప్రభుత్వ పాఠశాలల ఉపాధ్యాయులు బడిబాట కార్యక్రమం చేపట్టారు. ఉపాధ్యాయులు ఊరూరా, వీధి వీధికి వెళ్లి బడిబాట నిర్వహిస్తూ పిల్లలకు చదువు వల్ల కలిగే ప్రయోజనాలు చెబుతున్నారు. బడికి ఇది ముందుగా సిద్ధం చేసే కార్యక్రమం.



ప్రభుత్వ పాఠశాలపై అవగాహన కల్పిస్తున్న పిట్టిగుంట పాఠశాల ఉపాధ్యాయుడు

ఆసక్తి కలిగించేలా మాట్లాడాలి



ప్రాథమిక పాఠశాల విద్యార్థులు బడికి వెళ్లడానికి భయపడుతుంటారు. ఇప్పటి నుంచే వారిలో ఆసక్తి కలిగేలా పాఠశాల గురించి, పుస్తకాలు, స్నేహితుల గురించి తల్లిదండ్రులు మాట్లాడాలి. మొదటి వారంరోజులు ఉపాధ్యాయులు వారితో మమేకం కావాలి. – కరుణాకర్, చిన్నపిల్లల వైద్యులు

ప్రభుత్వ పాఠశాలల్లో అన్నీ ఉచితమే



ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులకు అన్నీ ఉచితమే. విద్యార్థులకు ఉచిత పాఠ్యపుస్తకాలు, యూనిఫాం, పౌష్టికాహారంతో పాటు చిక్కి, రాగి జావ, ఉచిత ఆరోగ్య పరీక్షలు, పరిశుభ్రమైన టాయిలెట్స్, ఇంగ్లీష్ మీడియం బోధనలు ఉంటాయి. పిల్లలు పాఠశాల వాతావరణానికి అలవాటు పడేలా పాఠశాలలను అందంగా తీర్చిదిద్దాము. – గానుగపెంట రమణారెడ్డి, పిట్టిగుంట ఎంపీపీ స్కూల్, కాశినాయన మండలం.

థ్యాంక్యూ సీఎం సార్

- కాంట్రాక్టు ఉద్యోగుల్లో ఆనందం నింపిన ముఖ్యమంత్రి
- సీఎం చిత్రపటానికి పాలాభిషేకం
- హాజరైన మేయర్ సురేష్‌బాబు, ఎమ్మెల్సీ రామచంద్రారెడ్డి

కడప ఎడ్యుకేషన్: కాంట్రాక్టు ఉద్యోగులను పర్మినెంట్ చేయడం చరిత్రాత్మకం అని కడప నగర్ మేయర్ సురేష్‌బాబు, ఎమ్మెల్సీ రామచంద్రారెడ్డిలు అన్నారు. కాంట్రాక్టు ఉద్యోగులంతా థ్యాంక్యూ సీఎం సార్ అంటూ రాష్ట్రమంతటా నినాదాలు చేస్తున్నారన్నారు. శుక్రవారం కడపలోని ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలలో గవర్నమెంట్ కాంట్రాక్టు లెక్చరర్ల ఫెడరేషన్ ఆధ్వర్యంలో కాంట్రాక్టు ఉద్యోగులంతా ముఖ్యమంత్రి చిత్రపటానికి పాలభిషేకం నిర్వహించారు. థ్యాంక్యూ.. సీఎం సార్ అంటూ తమ కృతజ్ఞతలు కార్యక్రమానికి మేయర్ సురేష్‌బాబు, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ రామచంద్రారెడ్డి ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. వారు మాట్లాడుతూ గత 22 సంవత్సరాలలో ఏ ముఖ్యమంత్రి చేయలేని పని మన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చేశారన్నారు. రాష్ట్రవ్యాప్తంగా 10,117 మంది కాంట్రాక్టు ఉద్యోగులను రెగ్యులర్ చేశారన్నారు. దీంతో కాంట్రాక్టు ఉద్యోగుల జీవితాల్లో వెలుగులు నిండాయన్నారు. ఇంకా మిగిలి ఉన్న కాంట్రాక్టు లెక్చరర్లను కూడా రెగ్యులర్ చేసేందుకు తమ వంతు కృషి చేస్తామన్నారు. కొత్త జిల్లాలు ఏర్పడిన తర్వాత 12 శాతం ఉన్న హెచ్‌ఆర్‌ఏను 16 శాతం పెంచారన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కాంట్రాక్టు లెక్చరర్స్ ఫెడరేషన్ ప్రెసిడెంట్ రామచంద్రారెడ్డి, గవర్నమెంట్ కాంట్రాక్టు లెక్చరర్స్ ఫెడరేషన్ ప్రధాన కార్యదర్శి చంద్రమోహన్‌రెడ్డి, గవర్నమెంట్ డిగ్రీ కాంట్రాక్ట్ లెక్చరర్స్ అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రాజగోపాల్‌రెడ్డి, నాయకులు వెంకటసుబ్బారెడ్డితోపాటు పలువురు కాంట్రాక్టు లెక్చరర్లు పాల్గొన్నారు.



సీఎం చిత్రపటానికి పాలభిషేకం చేస్తున్న మేయర్ సురేష్‌బాబు, ఎమ్మెల్సీ రామచంద్రారెడ్డి

వెట్టి చాకిరి నుంచి విముక్తి



కాంట్రాక్టు లెక్చరర్లకు వెట్టి చాకిరి నుంచి విముక్తి కల్పించి రెగ్యులరైజ్ చేసి వారికి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కొత్త జీవితాన్ని ప్రసాదించారు. ఆంధ్రప్రదేశ్ కాంట్రాక్టు లెక్చరర్ల తరపున సీఎంకు కృతజ్ఞతలు తెలియజేస్తున్నాం. – వెంకటసుబ్బారెడ్డి, ఏపీ కాంట్రాక్టు డిగ్రీ లెక్చరర్ల అసోసియేషన్ నాయకుడు.

మాట నిలబెట్టుకున్నారు



కాంట్రాక్టు ఉద్యోగుల విషయంలో సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ఇచ్చిన మాటను నిలబెట్టుకున్నారు. రాష్ట్రంలో 10,117 మంది కాంట్రాక్టు ఉద్యోగులను రెగ్యులర్ చేసి వారి జీవితాల్లో వెలుగులు నింపారు. – రామచంద్రారెడ్డి, గవర్నమెంట్ జూనియర్ కాంట్రాక్టు లెక్చరర్స్ ఫెడరేషన్ రాష్ట్ర ప్రెసిడెంట్

జీవితాంతం రుణపడి ఉంటాం



ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి పాదయాత్రలో ఇచ్చిన మాట ప్రకారం మమ్మల్ని రెగ్యులర్ చేసి మాట నిలబెట్టుకున్నారు. మా జీవితాల్లో వెలుగు నింపారు. ఆయనకు జీవితాంతం రుణపడి ఉంటాం. – రామలక్ష్మి , గవర్నమెంట్ కాంట్రాక్టు జూనియర్ లెక్చరర్

మమ్మల్ని కూడా రెగ్యులర్ చేయాలి



సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి 2009 నుంచి 2012 మధ్యలో చేరిన కాంట్రాక్టు లెక్చరర్లను రెగ్యులర్ చేయలేదు. అంతకు ముందు చేరిన వారందరిని రెగ్యులర్ చేశారు. మమ్మల్ని కూడా రెగ్యులర్ చేసి మా జీవితాల్లో వెలుగులు నింపుతారనే నమ్మకం ఉంది. –ఆదిలక్ష్మి, గవర్నమెంట్ జూనియర్ కళాశాల కాంట్రాక్టు లెక్చరర్

వైవీయూలో ప్రశాంతంగా పదోన్నతుల ప్రక్రియ

వైవీయూ: యోగివేమన విశ్వవిద్యాలయంలో అధ్యాపకులకు పదోన్నతుల ప్రక్రియ ప్రశాంతంగా సాగింది. శుక్రవారం విశ్వవిద్యాలయంలోని వైస్ చాన్సలర్ చాంబర్‌లో వీసీ ఆచార్య చింతా సుధాకర్ అధ్యక్షతన గవర్నర్ నామినీ సమక్షంలో విషయ నిపుణుల ఆధ్వర్యంలో అధ్యాపకులకు ఇంటర్వ్యూలు నిర్వహించారు. ఆటోమేటిక్ అడ్వాన్స్‌మెంట్ స్కీం (ఏఏఎస్)లో భాగంగా నిర్వహించిన పదోన్నతుల ప్రక్రియలో అధ్యాపకుల అకడమిక్ ప్రగతి, పరిశోధన, ప్రాజెక్టులు తదితర అంశాలపై సబ్జెక్టు నిపుణులు అధ్యాపకులను ఇంటర్వ్యూ చేశారు. మైక్రోబయాలజీ, తెలుగు, అనువర్తిత గణితశాస్త్రం, ఎంసీఏ విభాగాలకు చెందిన నలుగురు అధ్యాపకులకు పదోన్నతులు కల్పించనున్నారు. ఇందులో ముగ్గురు అసోసియేట్ నుంచి ప్రొఫెసర్‌గాను, ఒకరు అసిస్టెంట్ నుంచి అసోసియేట్ ప్రొఫెసర్‌గా పదోన్నతి పొందనున్నారు.



వైవీయూ పరిపాలన భవనం

గ్రంథాలయంతో బంధాన్ని పెంచండి

- డీఈఓ రాఘవరెడ్డి
- ముగిసిన వేసవి విజ్ఞాన శిబిరం

కడప కల్చరల్ : గ్రంథాలయాలు వ్యక్తిపైన, సమాజంపైన చూపించే ప్రభావాన్ని వర్ణించలేమని, నేటి తరానికి గ్రంథాలయాలతోగల బంధాన్ని మరింతగా పెంచాలని జిల్లా విద్యాశాఖాధికారి వై.రాఘవరెడ్డి అన్నారు. జిల్లా గ్రంథాలయ సంస్థ ఆధ్వర్యంలో మే 8 నుంచి విద్యార్థులకు నిర్వహించిన వేసవి విజ్ఞాన శిబిరం ముగింపు కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఐఏఎస్ లాంటి ఉన్నత చదువుల్లో పుస్తకాల పాత్ర గొప్పదని గుర్తించాలన్నారు. ఇటీవల ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి గ్రంథాలయాలలో ప్రవేశపెట్టిన చదవడం మాకిష్టం విశేష ఆదరణ పొందిందని, ఆయన ఆశయం మేరకు తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు వారానికి రెండుమార్లు అయినా పిల్లలను సమీప గ్రంథాలయాలకు తీసుకు వెళ్లాలని సూచించారు. కార్యక్రమానికి అధ్యక్షత వహించిన జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్ పర్సన్ ఉషారాణి మాట్లాడుతూ ముఖ్యమంత్రి విద్యకు అధిక ప్రాధాన్యత ఇస్తున్నారని, మౌలిక సదుపాయాల కల్పనతో విద్యార్థుల సర్వతోముఖాభివృద్ధిని సాధిస్తున్నారని కొనియాడారు. ఈ సంవత్సరం ఐదు కోట్లరూపాయల సెస్ వసూలు చేశామని, సభ్యత్వాల సంఖ్య బాగా పెంచామని వివరించారు. గ్రంథాలయ సంస్థ కార్యదర్శి అమీరుద్దీన్ నివేదిక సమర్పించారు.



మాట్లాడుతున్న జిల్లా విద్యాశాఖాధికారి రాఘవరెడ్డి

సర్వశిక్ష అభియాన్ పీఓ అంబవరం ప్రభాకర్‌రెడ్డి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం విద్యారంగాన్ని అద్భుత రీతిలో సంస్కరిస్తోందని, ఇది రాష్ట్ర విద్యారంగంలో విప్లవాత్మకమైన మార్పుగా అభివర్ణించారు. వయోజన విద్యాధికారి డాక్టర్ వి.సుబ్బారెడ్డి, విద్యావేత్త అలపర్తి పిచ్చయ్యచౌదరి, కేఎస్ఆర్ఎం కళాశాల చీఫ్ లైబ్రేరియన్ ప్రసాద్, బాల వికాస్ గంగయ్య తదితరులు కూడా ప్రసంగించారు. తొలుత నిర్వాహకులు, అతిథులు గ్రంథాలయ ఉద్యమ నేత గాడిచర్ల హరిసర్వోత్తమరావు చిత్రపటానికి పూలమాల అలంకరించి నివాళులర్పించారు. శిబిరంలో ప్రతిభ చూపిన విద్యార్థులకు బహుమతులు, ప్రశంసాపత్రాలు, పాల్గొన్న విద్యార్థులందరికీ ప్రతిభా పత్రాలు అందజేశారు. కార్యక్రమంలో గ్రంథాలయ సంస్థ సిబ్బంది, తల్లిదండ్రులు, విద్యార్థులు పాల్గొన్నారు.

వేధిస్తున్న స్టాంపుల కొరత

కడప కోటిరెడ్డిసర్కిల్:జిల్లాలోని అన్ని సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయాల్లో స్టాంపుల కొరత వేధిస్తోంది. దాదాపు 10–20 రోజులుగా రూ. 100, రూ. 50 విలువైన స్టాంపులు లభ్యం కాకపోవడంతో వినియోగదారులు అనేక ఇబ్బందులు పడుతున్నారు. జిల్లా వ్యాప్తంగా ఇదే పరిస్థితి నెలకొన్నట్లు తెలియవచ్చింది. దీంతో స్థిరాస్తుల క్రయ, విక్రయదారులు స్టాంపుల కోసం ఇతర జిల్లాలకు పరుగులు పెడుతున్నారు. ఈ సమస్యను అధిగమించేందుకు ఉన్నతాధికారులు తగిన చర్యలు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

ఈ–స్టాపింగ్‌పై దృష్టి

స్టాంపుల కొరతను తగ్గించేందుకు స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్ శాఖ అధికారులు ఈ–స్టాంపింగ్ విధానాన్ని అమలులోకి తీసుకు వచ్చారు. జిల్లాలోని కొందరు స్టాంప్ వెండర్లకు ఈ–స్టాపింగ్ లైసెన్సులను జారీ చేస్తున్నారు. అయితే ఈ–స్టాంపింగ్స్‌పై వినియోగదారులను చైతన్యవంతులను చేసేందుకు రిజిస్ట్రేషన్‌శాఖ అధికారులు దృష్టి సారిస్తున్నారు.

క్లుప్తంగా

గడ్డివామి దగ్ధం

చాపాడు : మండల పరిధిలోని ఖాదర్‌పల్లె గ్రామంలో గుర్తు తెలియని దుండగులు వరి గడ్డి వామికి నిప్పుబెట్టారు. గ్రామానికి చెందిన సి. సాబూన్‌కు చెందిన 5 ఎకరాల్లోని వరిగడ్డి వామిలో నుంచి గురువారం అర్ధరాత్రి మంటలు చెలరేగాయి.గమనించిన బాధితుడు, గ్రామస్థులు ఫైర్ సిబ్బందికి సమాచారమిచ్చారు. అగ్నిమాపక సిబ్బంది సంఘటనా స్థలంలోకి చేరుకుని మంటలు ఆర్పే ప్రయత్నం చేయగా అప్పటికే వరిగడ్డి పూర్తిగా కాలిపోయింది. కాలిపోయిన వరిగడ్డి రూ.50వేలు విలువ చేస్తుందని బాధితుడు తెలిపాడు. గుర్తు తెలియని వ్యక్తులు ఈ చర్యకు పాల్పడి ఉంటారని అనుమానం వ్యక్తం చేస్తూ బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

రైలు నుంచి జారిపడి వ్యక్తికి గాయాలు

ముద్దనూరు : మండలంలోని ఓబుళాపురం గ్రామ సమీపంలో ప్రమాదవశాత్తు రైలునుంచి జారిపడి ఓ వ్యక్తి తీవ్రంగా గాయపడ్డాడు. స్థానికుల కథనం మేరకు శుక్రవారం కర్ణాటకలోని బళ్లారి నుంచి హరిప్రియ ఎక్స్‌ప్రెస్‌లో అతను తిరుపతికి వెళుతున్నాడు.ఓబుళాపురం వద్ద రైలు నుంచి పడిపోవడంతో స్థానికులు 108కు సమాచారం ఇచ్చారు.గాయపడిన వ్యక్తి పేరు కార్తీక్ అని, ఇతనికి 28 సంవత్సరాల వయసు ఉంటుందని తెలిపారు.క్షతగాత్రున్ని 108 వాహనంలో ప్రొద్దుటూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరి మృతి

కడప కోటిరెడ్డిసర్కిల్ : కడపలోని వైఎస్సార్ లే అవుట్ వద్ద జరిగిన రోడ్డుప్రమాదంలో సూరి (30) అనే వ్యక్తి మృతి చెందగా, మరో ఇద్దరు గాయపడ్డారు. చిన్నచౌకు సీఐ శ్రీరామ్ శ్రీనివాసులు కథనం మేరకు..తిలక్‌నగర్‌కు చెందిన ముగ్గురు యువకులు ద్విచక్ర వాహనంలో వైఎస్సార్ లే అవుట్ వైపునకు బయలుదేరారు. ఈక్రమంలో ముందు వెళుతున్న లారీని ఓవర్ టేక్ చేయబోయారు.బైక్‌లో నుంచి ఒకరు కిందపడ్డాడు. లారీ వెనుక టైరు మీద వెళ్లడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. ఇద్దరికి గాయాలు కావడంతో చికిత్స నిమిత్తం రిమ్స్‌కు తరలించారు.వీరి వివరాలు తెలియాల్సి ఉంది. కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు.

అపహరణకు గురైన కారు స్వాధీనం



అట్లూరు : అపహరణకు గురైన కారును పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. స్థానిక ఎస్ఐ కె.సి.రాజు కథనం మేరకు ఈనెల 6వ తేదీన అట్లూరు క్రాస్‌రోడ్డు కు చెందిన వరకుమార్ ఇండికా కారు అపహరణకు గురైంది. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు గాలింపు చేపట్టారు. శుక్రవారం కారును స్వాధీనం చేసుకుని వరకుమార్‌కు అప్పగించారు.

కేంద్ర సాఫ్ట్‌వేర్‌తో అలవెన్స్‌లకు బ్రేక్

తట్ట బుట్ట, గడ్డ పార చార్జీలు కట్



ఉపాధి పనులను చేస్తున్న కూలీలు

వల్లూరు : కూలీలకు కోరిన సమయంలో పనులు కల్పిస్తూ ఆదుకుంటూ వచ్చిన మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో అమలులో ఉన్న రాష్ట్ర సాఫ్ట్‌వేర్ స్థానంలో కేంద్ర సాఫ్ట్‌వేర్‌ను తీసుకొచ్చారు. ఫలితంగా పథకం ప్రారంభం నుంచి కూలీలకు ఇస్తూ వచ్చిన పలు అలవెన్స్‌లకు బ్రేక్ పడింది.ముఖ్యంగా వేసవి అలవెన్స్, తట్ట , బుట్ట, గడ్డ పార చార్జీ, తాగు నీటి అలవెన్స్, మేట్ చార్జీ మొదలైనవి నిలిచిపోయాయి. దీంతో కూలీలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

ఇతర కాలాలతో పోలిస్తే వేసవిలో ఉపాధిహామీ కూలీలు వేడిని తట్టుకొని పని చేయాల్సి ఉంటుంది. ఫలితంగా పని కూడా తగ్గుతుంది. అయినా సాధారణ పని దినాల్లో వచ్చిన వేతనానికి తగ్గకుండా కూలీలు పొందేలా ప్రతి సంవత్సరం వేసవి ప్రారంభం నుంచి ముగిసే వరకు అదనపు కూలీని చెల్లించేలా ప్రభుత్వం ఏర్పాట్లు చేసేది. ఇందులో భాగంగా ప్రతి ఏడాది ఫిబ్రవరి మాసం నుంచి జూన్ చివరి వరకు అదనపు కూలీ రేట్లు వర్తించే విధంగా వేసవి ప్రారంభంలో ఉత్తర్వులు జారీ చేసేది. వేసవి డ్రై అలవెన్స్ రూపంలో ఫిబ్రవరిలో 20 శాతం, మార్చి నెలలో 25 శాతం, ఏప్రిల్, మే నెలల్లో 30 శాతం, జూన్ మాసంలో 20 శాతం అదనంగా వేతనం చెల్లించేది. కూలీలు ఈ నెలల్లో సూచించిన మేర శాతం తక్కువగా పని చేసినప్పటికీ పూర్తి స్థాయిలో కూలీని పొందడానికి అవకాశం కలిగేది. వ్యవసాయ పనులు అరకొరగా ఉండే వేసవిలో ఈ అదనపు అలవెన్స్‌ను సద్వినియోగం చేసుకుంటూ ఎక్కువ మంది కూలీలు పనులకు వచ్చేవారు. దీంతో రోజు రోజుకూ కూలీల సంఖ్య పెరిగేది.

కేంద్ర సాఫ్ట్‌వేరే కారణం

గతంలో రాష్ట్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో టీసీఎస్ సాఫ్ట్‌వేర్ ద్వారా ఎన్ఆర్ఈజీఎస్‌కు చెందిన కార్యకలాపాలు నిర్వహించేవారు. ఇందులో గుర్తించిన పనులకు సంబంధించి వివరాలను అప్‌లోడ్ చేసి ఎస్టిమేషన్‌ను జనరేట్ చేసేవారు. ఇతర రాష్ట్రాలతో సంబంధం లేకుండా మన రాష్ట్రంలోని పరిస్థితులను బట్టి పథకం కింద పనులు చేపట్టే వారు. రాష్ట్రంలో వేసవిని దృష్టిలో ఉంచుకుని ప్రభుత్వం ప్రత్యేక అలవెన్స్‌లు చెల్లించేది. కేంద్ర ప్రభుత్వం 2021 నవంబర్ నుంచి దేశ వ్యాప్తంగా ఒకే సాఫ్ట్‌వేర్‌ను అమలు చేయాలని నిర్ణయించింది. ఈ మేరకు నేషనల్ ఇన్ఫర్మేషన్ సెంటర్ (ఎన్ఐసీ) సాఫ్ట్‌వేర్‌ను అందుబాటులోకి తీసుకొచ్చింది.అన్ని రాష్ట్రాలు తప్పని సరిగా ఈ సాఫ్ట్‌వేర్ ద్వారా పథకం కార్యకలాపాలను నిర్వహించాలని ఆదేశాలు జారీ చేసింది. దీంతో రాష్ట్రంలో వేసవి అలవెన్స్‌లు ఇవ్వడానికి అవకాశం లేకుండా పోయింది. ఇది కూలీల పాలిట అశనిపాతంగా మారింది. వీటితో బాటు గతంలో పని ముట్ల వాడకానికి ఒక్కో కూలికి రోజుకు రూ 5 చొప్పున ఇచ్చే తట్ట, బుట్ట చార్జీలు, రోజుకు రూ 15 చొప్పున ఇచ్చే గడ్డ పార చార్జీలు సైతం నిలిచి పోయాయి. గ్రూపు మేట్‌కు ఆ రోజు పని చేసిన కూలీలను బట్టి ఒక్కో కూలికి రూ 3 చొప్పున మేట్ చార్జీ ఇచ్చే వారు. అది కూడా నిలిచి పోయింది. వేసవిలో దాహం తీర్చుకోవడానికి ఒక్కో కూలికి తాగునీటికి రోజుకు రూ 5 చొప్పున చెల్లించే వారు. మిగిలిన కాలంలో రోజుకు రూ 2.50 ఇచ్చేవారు. ఇవి కూడా ప్రస్తుతం పూర్తిగా నిలిచి పోయాయి. కాగా గతంలో కూలీల నివాసం ప్రాంతం నుంచి పని ప్రదేశానికి ఇచ్చే రవాణా చార్జీని మాత్రం కొనసాగిస్తున్నారు.

మేట్ చార్జీలు రావడంలేదు



నేను ప్రతి రోజు పని ప్రదేశంలో గ్రూపు సభ్యుల హాజరును నమోదు చేయాల్సి ఉంటుంది. తర్వాత ఆరోజు వచ్చిన కూలీల సంఖ్యను బట్టి గరిష్ట వేతనం పడడానికి చేయాల్సిన పనిని మార్కింగ్ ఇవ్వాల్సి ఉంటుంది. అధికారులు కొలతలు తీయడానికి పని ప్రదేశానికి వచ్చినపుడు అందుబాటులో ఉండాలి. గతంలో మేట్ చార్జీలు ఇచ్చేవారు. కొంత ఉపశమనంగా ఉండేది. ప్రస్తుతం రావడం లేదు.

– వీరయ్య, ఉపాధి మేట్, తోల్లగంగనపల్లె

తాగునీటి చార్జీలు నిలిచిపోయాయి



గతంలో ఇచ్చే తట్ట, బుట్ట, గడ్డ పార చార్జీలు, తాగు నీటి చార్జీలు కూడా ఇవ్వడం లేదు. అధికారులను అడిగితే ప్రస్తుతం అవి నిలిచి పోయాయని అంటున్నారు.

– సరోజ, ఉపాధి హామీ కూలీ, కుమారునిపల్లె.

వేసవి అలవెన్స్‌లు ఇవ్వాలి



గతంలో ఫిబ్రవరి నుంచి జూన్ మాసం వరకు వేసవి అలవెన్స్‌లను ఇచ్చే వారు. ఎండా కాలం వేడి వల్ల పనులు కొంత తక్కువగా చేసినా కూలీ డబ్బు మాత్రం బాగానే వచ్చేది. ఇప్పుడు వేసవి అలవెన్స్‌లు లేక పోవడంతో తక్కువ కూలీ పడుతోంది. అధికారులు స్పందించి వేసవి అలవెన్స్‌లను కొనసాగించాలి.

– బి. బాలయ్య, ఉపాధి హామీ కూలీ, కుమారునిపల్లె

ఒక్కటైన ఆంధ్ర అబ్బాయి, ఒడిశా అమ్మాయి



నూతన వధూవరులు రాజ్ లక్ష్మీ, విష్ణువర్ధన్‌రెడ్డి

రాజుపాళెం : ఆంధ్ర అబ్బాయి, ఒడిశా అమ్మాయి ఇద్దరు ఒక్కటైన సంఘటన రాజుపాళెం మండలం వెల్లాల గ్రామంలోని సీతారాముల కల్యాణ మండపంలో జరిగింది. ఇదే మండలంలోని పర్లపాడు గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ నాయకుడు బుక్కసముద్రం జగదీశ్వరరెడ్డి సోదరుడు బుక్కసముద్రం విష్ణువర్ధన్‌రెడ్డి గత 15 ఏళ్లుగా ఒడిశా రాష్ట్రంలోని పోరాపుట్ జిల్లాలో ఉన్నాడు. ఈ క్రమంలో గత మార్చిలో పోరాపుట్ జిల్లాలోని జయపురం మున్సిపాలిటీలో కౌన్సిలర్‌గా పోటీ చేసి గెలుపొందాడు. శుక్రవారం ఒడిశా రాష్ట్రానికి చెందిన ప్రొఫెసర్ రాజ్‌లక్ష్మిని విష్ణువర్ధన్‌రెడ్డి వెల్లాల సీతారామల కల్యాణ మంపడంలో వివాహం చేసుకున్నాడు. వధూవరులను ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు పోరెడ్డి నరసింహారెడ్డి, ఇన్‌చార్జి ఎంపీపీ నారాయణరెడ్డి, జెడ్పీటీసీ సభ్యురాలు అంజనీకుమారి, బుక్కసముద్రం జగదీశ్వరరెడ్డి, ఎంపీటీసీ సభ్యురాలు ప్రవల్లిక, సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు ఆశీర్వదించారు.

వైద్యులు ప్రజా సేవకు అంకితం కావాలి

డిప్యూటీ సీఎం అంజద్‌బాషా



మాట్లాడుతున్న ఉప ముఖ్యమంత్రి ఎస్‌బీ అంజద్‌బాషా

కడప కోటిరెడ్డిసర్కిల్ : వైద్యులు ఎల్లప్పుడూ ప్రజలకు అందుబాటులో ఉంటూ ప్రజా సేవకు అంకితం కావాలని ఉప ముఖ్యమంత్రి ఎస్‌బీ అంజద్‌బాషా పేర్కొన్నారు. శుక్రవారం సాయంత్రం కడప నగర శివార్లలోని ఫాతిమా మెడికల్ కళాశాలలో గ్రాడ్యుయేషన్ డే వేడుకలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన డిప్యూటీ సీఎం మాట్లాడుతూ రాష్ట్రంలో ఏకైక మైనార్టీ కళాశాలగా ఫాతిమా మెడికల్ కళాశాల వైఎస్సార్ జిల్లాలో ఉండడం అభినందనీయమన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి విద్యా రంగంలో సమూల మార్పులు తీసుకు వస్తున్నారన్నారు, విద్యకు అధిక ప్రాధాన్యత ఇస్తున్నారన్నారు. అందులో భాగంగా రాష్ట్రంలో 17 మెడికల్ కళాశాలల ఏర్పాటుకు చర్యలు చేపట్టారని, అందులో ఐదింటికి అనుమతులు వచ్చాయన్నారు. ఒక్కోకళాశాలకు 150 సీట్లు చొప్పున మొత్తం 750 మంది విద్యార్థులు ఎంబీబీఎస్ చదువుకునే అవకాశం లభిస్తుందన్నారు. గతంలో వైద్య విద్య సామాన్యులకు అందుబాటులో ఉండేది కాదని, దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి నాలుగు శాతం రిజర్వేషన్లు తీసుకు రావడంతో మైనార్టీలకు ఎంబీబీఎస్ చేసే అవకాశం లభించిందన్నారు. ప్రతి ఏడాది 180–200 మంది విద్యార్థులు ఎంబీబీఎస్ పూర్తి చేసుకుంటున్నారన్నారు. ప్రభుత్వ ఆధ్వర్యంలో మెడికల్ కళాశాలలు ఏర్పాటు చేసేందుకు అన్నిచర్యలు తీసుకుంటున్నారని, అందుకు సంబంధించి అనుమతులకోసం సీఎం అధికారులను పరుగులు పెట్టిస్తున్నారన్నారు. కడపలోని ఫాతిమా వైద్య కళాశాలకు తొలుత కొన్ని ఇబ్బందులు ఎదురయ్యాయని, తర్వాత వాటిని ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించామన్నారు. 2015లో ఈ కళాశాలలో ఎంబీబీఎస్ చేరిన కొంతమంది ఇబ్బందులు ఎదుర్కోగా, ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రూ. 9 కోట్లను ఫీజుల రూపంలో విడుదల చేసి ఆదుకున్నారని తెలిపారు. ప్రతి విద్యార్థి పవిత్రమైన వైద్య వృత్తి చేయాలన్న సంకల్పంతో కళాశాలలో చేరడం అభినందనీయమన్నారు. ఫాతిమా వైద్య కళాశాలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తినా వాటిని పరిష్కరించేందుకు తమవంతుగా కృషి చేస్తామన్నారు. డాక్టర్ వైఎస్సార్ హెల్త్ యూనివర్శిటీ వీసీ డాక్టర్ కె.బాబ్జి, ఫాతిమామెడికల్ కళాశాల చైర్మన్ వీపీ సిద్దిఖ్, వైస్ చైర్మన్ ఐహెచ్ ఫరూఖ్, సెక్రటరీ కమ్ కరస్పాండెంట్ జావెద్ అహ్మద్ ఖురేషి, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ మహమ్మద్ సల్మాన్ ముర్తజా, డైరెక్టర్ డాక్టర్ జయరామిరెడ్డి, ప్రిన్సిపాల్ డాక్టర్ గిరిధర్, మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ ఎల్‌సీ ఓబులేశు, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ రామ్ మనోహర్‌రెడ్డి, మాజీమంత్రి అహ్మదుల్లా తదితరులు మాట్లాడారు. అనంతరం వందమంది విద్యార్థులకు పట్టాలను ప్రదానం చేశారు.

ప్రొద్దుటూరుకు చేరిన మదరసా విద్యార్థులు

9 మందిని విజయవాడలో ఆపిన ఆర్‌పీఎఫ్ పోలీసులు



మదరసా నిర్వాహకుడితో విద్యార్థులు

ప్రొద్దుటూరు క్రైం : జార్ఖండ్ రాష్ట్రానికి చెందిన మదరసా విద్యార్థులు 9 మంది సురక్షితంగా ప్రొద్దుటూరుకు చేరారు. జార్ఖండ్ రాష్ట్రంలోని జామత్రా జిల్లాకు చెందిన 13 మంది పిల్లలు ప్రొద్దుటూరులోని దర్గాబజార్‌లో ఉన్న మదరసా ఏ ఉలూం అమీర్ ఏ హంజా అనే మదరసాలో ఉచితంగా అరబ్బీ విద్యను అభ్యసిస్తున్నారు. వీరిలో 9 మంది రంజాన్ మాసం సెలవుల్లో వారి స్వస్థలాలకు వెళ్లారు. ఈ క్రమంలో వారి గురువు ఫారూకీతో కలసితో గురువారం రైలులో ప్రొద్దుటూరుకు బయలుదేరారు. విజయవాడలో రైలు దిగిన తర్వాత అనుమానంతో అక్కడి ఆర్‌పీఎఫ్ పోలీసులు పిల్లలను ఆపి వారి కార్యాలయానికి తీసుకెళ్లారు. ఎక్కడికి వెళ్తున్నారని వారిని ప్రశ్నించగా ప్రొద్దుటూరుకు వెళ్తున్నామని పూర్తి వివరాలను వెల్లడించారు. దీంతో వాస్తవాలు తెలుసుకునేందుకు ఆర్‌పీఎఫ్ అధికారులు కడప జిల్లా కలెక్టర్‌ను ఫోన్‌లో సంప్రదించారు. కలెక్టర్ సూచనల మేరకు ప్రొద్దుటూరు ఏఎస్పీ ప్రేరణాకుమార్ విద్యార్థులకు సంబంధించి విచారణ చేయాలని 1 టౌన్ సీఐ రాజారెడ్డికి తెలిపారు. సీఐ మదరసాను సందర్శించి విద్యార్థులను విచారించగా 9 మంది బాలలు ఇక్కడి మదరసాలో చదువుతున్నట్లు నిర్ధారణ అయింది. దీంతో ఏఎస్పీ ప్రేరణాకుమార్ కలెక్టర్ ద్వారా ఆర్‌పీఎఫ్ అధికారులకు నివేదికను పంపించారు. తర్వాత ఆర్‌పీఎఫ్ అధికారులు దగ్గరుండి పిల్లలను శుక్రవారం ప్రొద్దుటూరుకు పంపించారు. పోలీసులకు విద్యార్థులు, మదరసా నిర్వాహకులు కృతజ్ఞతలు తెలిపారు. కాగా విద్యార్థులకు సంబంధించిన వార్త ఉదయం నుంచి సోషల్ మీడియాలో వైరల్ అయింది. దీంతో పలువురు ఆందోళన చెందుతూ పోస్టులు పెట్టారు. ఎట్టకేలకు పిల్లలు ప్రొద్దుటూరుకు చేరడంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు.

అదుపుతప్పి..వాహనాలపైకి దూసుకెళ్లి..

- గువ్వలచెరువుఘాట్‌లో ప్రమాదం
- కార్లు, బైక్‌పై పడిన పాలవ్యాన్
- ఒకరి మృతి, నలుగురికి గాయాలు



కార్లపై బోల్తా పడిన పాల వ్యాన్



సుజన మృతదేహం



గాయపడిన బాలాజీ రెడ్డి

చింతకొమ్మదిన్నె : కడప–రాయచోటి ప్రధాన రహదారిలోని గువ్వల చెరువు ఘాట్ రోడ్డులో గల నాలు మలుపు వద్ద శుక్రవారం పాలవ్యాన్ అదుపు తప్పి బోల్తా పడింది. ఈ ప్రమాదంలో సుజన (59) అనే మహిళ మృతిచెందింది.

ఆర్టీసీ బస్సును ఢీకొని ఒక్కసారిగా పల్టీ కొట్టి రెండు కార్లతో పాటు, ఒక ద్విచక్ర వాహనంపై పడింది. దీంతో కార్లు, బైక్ నుజ్జు నుజ్జు అయ్యాయి. సీకేదిన్నె ఎస్ఐ భూమా అరుణ్‌రెడ్డి కథనం మేరకు రాయచోటి నుంచి కడపకు వస్తున్న పాల వ్యాన్ ఘాట్ రోడ్డులోని నాలు మలుపు వద్దకు రాగానే అదుపు తప్పి ఆర్టీసీ బస్సును వెనుకవైపు నుంచి ఢీకొంది. ఒక్కసారిగా పల్టీ కొట్టింది. కడప నుంచి రాయచోటికి వెళ్తున్న రెండు కార్లు, ఒక ద్విచక్ర వాహనంపై బోల్తా పడింది. ఈ ప్రమాదంలో కారులో ప్రయాణిస్తున్న సుజన మృతి చెందగా రవి చంద్ర, శ్రియ, ద్విచక్ర వాహనంలో వెళుతున్న బాలాజీరెడ్డి, చంద్రశేఖర్ రెడ్డి తీవ్రంగా గాయపడ్డారు.విషయం తెలుసుకున్న చింతకొమ్మదిన్నె ఎస్ఐ అరుణ్‌రెడ్డి తమ సిబ్బందితో ఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. గాయపడిన వారిని 108లో చికిత్స రిమ్స్‌కు తరలించారు.

గువ్వల చెరువు ఘాట్ రోడ్డులోని నాలుగో మలుపు వద్ద వాహనాలు రోడ్డుకు అడ్డంగా పడటంతో రాకపోకలు నిలిచిపోయాయి. పోలీసులు క్రేన్ సాయంతో వాహనాలు పక్కకు తొలగించారు. రాకపోకలను పునరుద్ధరించారు. ఈ సంఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

అనారోగ్యంతో యువతి ఆత్మహత్య



పల్లవి మృతదేహం

కడప కోటిరెడ్డిసర్కిల్ : కడపలోని ఆకులవీధిలో నివాసముంటున్న శ్రీనివాసులు, ప్రశాంతిల కుమార్తై కొర్రపాటి పల్లవి (25) అనే యువతి ఈనెల 8వ తేదీ ఆత్మహత్యకు పాల్పడింది. పల్లవికి చెల్లెలు ఉంది. పల్లవి ఓ విద్యా సంస్థలో అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా పనిచేస్తోంది. చాలా రోజులుగా కడుపునొప్పితో బాధపడుతూ ఉండేది. తట్టుకోలేక ఇంటిలో ఎవరూ లేని చున్నీతో ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. మృతురాలి తల్లి ప్రశాంతి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు టూ టౌన్ పోలీసులు తెలిపారు.

ఇసుక తరలింపు అడ్డగింత



ఇల్లూరు గ్రామ ప్రజలతో మాట్లాడుతున్న ఎస్ఈబీ, పోలీసు అధికారులు

ఎర్రగుంట్ల : మండల పరిధిలోని ఇల్లూరు గ్రామ సమీపంలో ఉన్న పెన్నానది నుంచి ఇసుకను తరలిస్తే మా గ్రామానికి ముంపు సమస్య ఉంటుందని ప్రజలు చెబుతున్నారు. ఇల్లూరు గ్రామ సర్పంచ్ మోపూరి కిష్టారెడ్డి , వైఎస్సార్‌సీపీ నాయకుడు మోపూరి దస్తగిరి రెడ్డిల ఆధ్వర్యంలో ఇసుక తరలింపును అడ్డుకున్నారు. పరిస్థితి అదుపు తప్పే ప్రమాదం ఉందని తెలుసుకున్న పోలీసులు రంగ ప్రవేశం చేశారు. పోలీస్‌స్టేషన్లకు పెద్ద ఎత్తున వస్తున్న ప్రజలను పోలీసులు మార్గ మధ్యలోనే అడ్డుకున్నారు. ఈ సందర్భంగా గ్రామ ప్రజలు తరపున గ్రామ సర్పంచ్ తనయుడు దస్తగిరిరెడ్డి మాట్లాడుతూ గతంలో ఈ గ్రామంలో ఇసుక క్వారీకి అనుమతి ఇచ్చారని, దాని సమయం పూర్తయిందని, అనుమతి ఇచ్చిన 50 వేలక్యూబిక్ మీటర్ల ఇసుకను తరలించారన్నారు. ఇప్పుడు మళ్లీ ఇసుక తరలిస్తే పైపులైన్ దెబ్బతిని నీటి సమస్య ఏర్పడుతుందని, గ్రామంలో రోడ్లు దెబ్బతింటాయని అన్నారు. అనంతరం జమ్మలమడుగు డీఎస్పీ నాగరాజు ఆధ్వర్యంలో తహసీల్దార్ ఎ నాగేశ్వరరావు, కొండాపురం సీఐ సుదర్శన్ ప్రసాద్, ఎస్ఈబీ సీఐ సురేష్‌రెడ్డి, ఎస్ఐ సంజీవరెడ్డిలు దస్తగిరెడ్డితో చర్చించారు. జమ్మమడుగు డీఎస్పీ నాగరాజు మాట్లాడుతూ ఈ సమస్యపై మైనింగ్ శాఖ అధికారులు ఇచ్చిన నివేదిక ప్రకారం తదుపరి చర్యలు తీసుకుంటామన్నారు. ఎంత వరకు ఇసుకను తరలించారు...క్వారీ ఉన్న చోటా ఇసుకను తీశారా, లేదా మరో చోటా తీశారా అనే దానిపై మైనింగ్ శాఖ అధికారులు పూర్తి వివరాలతో నివేదికలు ఇస్తే తదుపరి నిర్ణయం తీసుకుంటామని తెలిపారు.

వైఎస్ జగన్‌ను మళ్లీ సీఎం చేసేందుకు కృషి చేయాలి

వైఎస్సార్‌సీపీ గల్ఫ్, కువైట్ కన్వీనర్లు బీహెచ్ ఇలియాస్, బాలిరెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న గల్ఫ్ కన్వీనర్ బీహెచ్ ఇలియాస్

కడప కార్పొరేషన్ : ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో వైఎస్ జగన్ మోహన్‌రెడ్డిని మళ్లీ సీఎం చేయడానికి ప్రవాసాంధ్రులు కృషి చేయాలని వైఎస్సార్‌సీపీ గల్ఫ్ కన్వీనర్ బీహెచ్ ఇలియాస్, కువైట్ కన్వీనర్ ఎం. బాలిరెడ్డి అన్నారు. శుక్రవారం కువైట్‌లోని మాలియా ప్రాంతంలోని పవన్ ఆంధ్ర రెస్టారెంట్‌లో కువైట్ కమిటీ సభ్యులు, వైఎస్సార్‌సీపీ అభిమానులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాల వల్ల రాష్ట్రం మరో శ్రీలంక అవుతుందని చెప్పిన చంద్రబాబు, అదే నోటితో ఉచిత వాగ్దానాలు ఇవ్వడం దారుణమన్నారు. 600 ఉచిత హామీలిచ్చి మేనిఫెస్టోను వెబ్‌సైట్ నుంచి తొలగించిన ఘనత బాబుకే దక్కుతుందన్నారు. చంద్రబాబు, లోకేష్ మాటలు నమ్మేందుకు ప్రజలు సిద్ధంగా లేరన్నారు. కో కన్వీనర్లు గోవిందు నాగరాజు, ఎంవీ నరసారెడ్డి, కోశాధికారి ఎన్. మహేష్‌రెడ్డి మాట్లాడుతూ రాబోయే ఎన్నికల్లో సుమారు 2వేల మందితో రాష్ట్రానికి వచ్చి ఎన్నికల ప్రచారం చేసేందుకు సిద్ధంగా ఉన్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో గవర్నింగ్ కౌన్సిల్ సభ్యులు ఎం. చంద్రశేఖర్‌రెడ్డి, లాజరస్, సలహాదారు ఎన్. చంద్రశేఖర్‌రెడ్డి, రాజశేఖర్ శర్మ, షేక్ రహమతుల్లా, రమణయాదవ్, మర్రి కళ్యాణ్, బీఎస్ సింహా తదితరులు పాల్గొన్నారు.

‘జగనన్నకు చెబుదాం’కు స్పందన

బి.కొత్తకోటలో మూడు ఇసుక ట్రాక్టర్లు సీజ్

బి.కొత్తకోట : ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న జగనన్నకు చెబుదాంకు అందిన ఫిర్యాదుపై శుక్రవారం అన్నమయ్య జిల్లా మదనపల్లె ఎస్ఈబీ సీఐ పి.శ్రీహరిరెడ్డి ఆధ్వర్యంలో ఇసుక తరలింపుపై బి.కొత్తకోటలో దాడులు నిర్వహించారు. మూడు ట్రాక్టర్లను సీజ్‌చేసి స్థానిక పోలీసులకు అప్పగించగా కేసు నమోదు చేశారు. వివరాలు..ఈనెల ఆరోతేదీన బి.కొత్తకోట నుంచి ఓ వ్యక్తి ఆలేరువాగు పక్కనే ఉన్న పట్టా భూమిలోని ఇసుకను ఖాదర్‌బాషా అనే వ్యక్తి విక్రయించుకుంటున్నాడని, వర్షాలు, వాగు ప్రవాహ సమయంలో పక్కనే ఉన్న వ్యవసాయ భూములకు నష్టంవాటిల్లుతుందని జగనన్నకు చెబుదాంకు ఫిర్యాదు చేశారు. ఏడో తేదీ ఫిర్యాదు వివరాలు మదనపల్లె ఎస్ఈబీ స్టేషన్‌కు చేరాయి. దీనిపై సమీక్షించిన సీఐ శ్రీహరిరెడ్డి, హెడ్‌కానిస్టేబుళ్లు హరికుమార్, మునిరామయ్య, కానిస్టేబుల్ దామోదర్‌లతో కలిసి ఫిర్యాదుదారున్ని కలిసి విచారించారు. అనంతరం ఆలేటి వాగు వద్ద దాడులు నిర్వహించి ఇసుక తరలిస్తున్న మూడు ట్రాక్టర్లను పట్టుకున్నారు. ఇసుక ఎక్కడి నుంచి ఎక్కడికి తరలిస్తున్నారు, దీనికి సంబంధించిన అనుమతులు ఉన్నాయా అని డ్రైవర్లను విచారించారు. ఎలాంటి రికార్డులు లేకపోవడంతో వాటిని సీజ్‌చేసి పోలీస్‌స్టేషన్ తరలించారు. ఏఎస్ఐ బొజ్జేనాయక్ మూడు ట్రాక్టర్లకు చెందిన డ్రైవర్లు బుచ్చిరెడ్డిగారిపల్లెకు చెందిన హరికృష్ణ (38), దాసు (40), పీటీఎం మండలం మల్లెలకు చెందిన భాస్కర్ (28)లపై కేసు నమోదు చేశారు. ఈ సందర్భంగా సీఐ శ్రీహరిరెడ్డి విలేకరులతో మాట్లాడుతూ బి.కొత్తకోటకు చెందిన ఖాదర్‌బాషా పట్టాభూమిలోని ఇసుకను ట్రాక్టర్‌కు రూ.700కు విక్రయిస్తున్నట్లు నిర్ధారించామని చెప్పారు. దీనిపై చర్యలు తీసుకోవాలని రెవెన్యూ అధికారులకు సిఫార్సు చేస్తున్నట్టు చెప్పారు.